సాక్షి వనపర్తి

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ఉత్సవాలు విజయవంతం

జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయి.

వివరాలు 8లో ▸



508 మి.యూ., విద్యుదుత్పత్తి

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 508.238 మి.యూ. ఉత్పత్తి చేపట్టారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 36.6 /21.1

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత.. సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం



కొత్తకోట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని జిల్లా వైద్యాధికారి డా. జయచంద్రమోహన్ అన్నారు. కమాలోద్దీన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సౌజన్యలత ప్రసవం సోమవారం కొత్తకోట పీహెచ్‌సీలో జరిగింది. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ ఆస్పత్రిని సందర్శించి సౌజన్యలతతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. డా. సౌజన్యలత ప్రసవంతో సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలుగుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవసరం లేకున్నా సిజేరియన్ చేసి డబ్బులు దండుకుంటారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుభవజ్ఞులైన వైద్యసిబ్బంది ఉండటంతో సురక్షిత పద్ధతిలో సాధారణ ప్రసవాలు చేస్తారని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లాలోని పలు కేజీబీవీల్లో ఉన్న ఖాళీల భర్తీకి తాత్కాలిక పద్ధతిన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరచింత, పెద్దమందడి, రేవల్లి, ఖిల్లాఘనపూర్ పాఠశాలల్లో ఏఎస్‌ఎం, రేవల్లి, ఆత్మకూర్, పెద్దమందడిలో అకౌంటెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 21 సాయంత్రం 5లోపు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాల్లో ఏదో ఒక బీమాను కలిగి ఉండాలని నాబార్డ్ ఏజీఎం మనోహర్ సూచించారు. సోమవారం స్థానిక ఏపీజీవీ బ్యాంకులో మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, సిబ్బందితో కలిసి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఏటీఎం రూపే కార్డును వాడి సమయం ఆదా చేసుకోవాలని సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని.. ఓటీపీ చెప్పాలని అడిగితే తప్పుడు కాల్‌గా గుర్తించాలని చెప్పారు. బ్యాంకు నుంచి ఎవరు కూడా ఓటీపీలు అడగరని.. అనుకోకుండా ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా అయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. బ్యాంకుల్లో ఎవరైనా లంచాలు అడిగితే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సంజీవరావు, అఖిల్, క్యాషియర్ అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా హాకీ జట్టు ఎంపిక

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో బుధవారం ఉమ్మడి జిల్లా హాకీ సీనియర్ పురుషుల జట్టు ఎంపికలు ఉంటాయని హాకీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.కుమార్ సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని హాకీ క్రీడాకారులు పాల్గొనాలని.. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా తరఫున ఆడతారని వివరించారు.

18న పాలమూరులో క్రికెట్ జట్టు..

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని మైదానంలో ఈనెల 21 నుంచి వారం రోజుల పాటు అండర్–23 ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టోర్నమెంట్‌లో పాల్గొనే ఆరు జట్లను ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వైట్ డ్రెస్, వైట్ షూస్‌తో హాజరుకావాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణకు కృషి

- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా భాగస్వామ్యంతో పనిచేస్తాం
- పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు వెల్లడి

– వివరాలు 10లో..

లక్ష్యం.. నిర్లక్ష్యం

గ్రామాల్లో నిరుపయోగంగా మారిన క్రీడా మైదానాలు



అమరచింత మండలం మస్తీపురం గ్రామంలో క్రీడా మైదానంలో సాగు చేసిన పత్తి పంట

- పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండిన వైనం
- కనిపించని క్రీడా సామగ్రి
- ఆగమేఘాల మీద ఏర్పాటుచేసిన గత ప్రభుత్వం
- పట్టించుకోని అధికార యంత్రం



మదనాపురం మండలం కొన్నూరులో పిచ్చి మొక్కలతో నిండిన క్రీడా మైదానం

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామానికో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మైదానానికి రూ.5 లక్షలు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడంలో సఫలీకృతమైంది. కొన్ని గ్రామాల్లో పాఠశాల మైదానాల్లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడుతుండగా.. మరికొన్ని గ్రామాల్లో ఊరికి దూరంగా గుట్టల ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. రాళ్లు తేలిన ప్రదేశాల్లో సైతం ఏర్పాటు చేయడం, సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో అధికారులు అక్కడ క్రీడా మైదానం ఉందన్న సంగతే మరిచారు.

నిర్వహణ మరిచిన అధికారులు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు చెత్తా చెదారంతో నిండుకున్నాయి. మరికొన్ని చోట్ల వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన సామగ్రి సైతం కనిపించకుండా పోయాయి. పలుచోట్ల పంటలు కూడా సాగు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో కోర్టులను తయారుచేసిన అధికారులు అందుకు సంబంధించిన సామగ్రిని సమకూర్చకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. క్రీడాకారుల కోసం అన్నిరకాల సామగ్రితో కిట్‌ను ఆయా గ్రామపంచాయతీలకు అప్పగించినా.. అవి కూడా ఎక్కడ కనిపించడం లేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేక దాతల సహకారం అందక ఏర్పాటు కాలేదు.

త్వరలోనే సీఎం కప్..

త్వరలో సీఎం కప్ పోటీలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతుండటంతో గ్రామీణ క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ ప్రాక్టీస్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఏర్పాటు చేసిన మైదానాలు నేడు నిరుపయోగంగా మారాయని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

వసతుల లేమి..



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించాలి. పాన్‌గల్‌లో వాలీబాల్ కోర్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు.. వాలీబాల్ నెట్, బాల్స్‌ను క్రీడాకారులకు అందించడం లేదు. ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడికి వెళ్లి ఆడలేని పరిస్థితి ఉంది.

– చిన్నపాగ భాను, వాలీబాల్ క్రీడాకారుడు, పాన్‌గల్

క్రీడా మైదానాలు కరువు..



పట్టణంలోని పది వార్డుల్లో ఎక్కడ కూడా క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చిన్నపాటి ఖాళీ స్థలాలను చూపి క్రీడా మైదానాల సూచిక బోర్డులు ఏర్పాటుచేసి నిధులు దండుకున్నారు. రోజు కబడ్డీ, వాలీబాల్ ప్రాక్టీస్ చేసుకునేందుకే సరైన మైదానాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– బాలకృష్ణ, అమరచింత

వినియోగంలోకి తీసుకొస్తాం..



గ్రామాల్లో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాల్లో క్రీడా సామగ్రి, సౌకర్యాలు సమకూర్చి క్రీడాకారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నాం. కొన్ని గ్రామాల్లో వసతులు లేవని తెలిసింది.. ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూస్తాం.

– సురేష్‌కుమార్, డీపీఓ

బీమా యోజనపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీ డా. మల్లు రవి.. చిత్రంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి
- జిల్లా దిశ కమిటీ చైర్మన్, ఎంపీ డా. మల్లు రవి

వనపర్తి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై బ్యాంకర్లు అవగాహన కల్పించాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్, ఎంపీ డా. మల్లు రవి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జీవన్‌జ్యోతి యోజన, అటల్ బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన తదితర పథకాలపై బ్యాంకుల వారీగా సుదీర్ఘంగా చర్చించారు. ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులు ఎంతమంది ఉన్నారు.. ఎందరికి బీమా సౌకర్యం కల్పించారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు బీమా సౌకర్యం కల్పించడంపై బ్యాంకర్లు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని.. ఈ విషయాన్ని ఆర్‌బీఐ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశానికి గైర్హాజరైన బ్యాంకు అధికారులకు నోటీసులు పంపించాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో రాసిన మినిట్స్ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి, నివేదికను పార్లమెంట్‌లో సమర్పిస్తామన్నారు. బ్యాంకు అధికారుల్లో చాలా మంది తెలుగు అర్థంకాని వారే ఉన్నారని.. ప్రజలకు ఎలా సేవలందిస్తారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రోగ్రెస్ రిపోర్టులో కొన్ని బ్యాంకుల పురోగతి సున్నాగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. కరూర్ వైశ్యాబ్యాంకు మేనేజర్ గైర్హాజరుపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌డీఎం పర్యవేక్షణ సక్రమంగా చేయాలని, సమీప భవిష్యత్‌లో పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. ముద్ర, టర్మ్, ప్రియారిటీ, నాన్ ప్రయారిటీ సెక్టార్ రుణాల లక్ష్యం, మంజూరు చేసిన రుణాలపై సమీక్షించారు. కొన్ని బ్యాంకులు పంట రుణాలు సైతం ఇవ్వడానికి నిర్లక్ష్యం చూపడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే సమావేశం నాటికి బీమాపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 2021–22లో మంజూరైన ఎస్సీ సంక్షేమశాఖ 80 శాతం రాయితీ రుణాలకు ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేయకపోవడం ఏమిటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల విషయంలో సహకారం అందించాలని కోరారు.

వసతుల కల్పనకు కృషి

జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లోని మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులకు ప్రతిపాదనలు ఇవ్వాలని, ఎంపీ నిధులతో బాగు చేయిస్తామని ఎంపీ తెలిపారు. అనంతరం విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, పౌరసరఫరాల, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖపై సమీక్ష నిర్వహించారు. పురోగతి నామమాత్రంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురుకులాల్లోని విద్యార్థుల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో విద్యార్థులను నమోదు చేయించడానికి దిశ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. సీఎమ్మార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు. ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ తీగల తొలగింపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుపై పూర్తి నివేదిక ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. బీఎస్‌ఎన్‌ఎల్‌పై సమీక్షిస్తూ సిగ్నల్ సమస్య తలెత్తకుండా కొత్త టవర్ల ఏర్పాటు, ఫ్రీక్వెన్సీ పెంచేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లాకొత్వాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ అర్జీలకు సత్వర పరిష్కారం

వనపర్తి: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిశీలించి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని అర్జీదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినతులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత ఠాణాల పోలీసు అధికారులకు సిఫారస్ చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయం వరకు ఆరు అర్జీలు దాఖలు కాగా.. అందులో భూ తగాదాలకు సంబంధించి 3, కుటుంబ తగాదాకు సంబంధించి 1, పరస్పర గొడవలకు సంబంధించి ఒక అర్జీ ఉన్నాయి.

పంటలకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దు..

రైతులు తమ పంటల రక్షణకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని ఎస్పీ రావుల గిరిధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కంచెలతో ప్రజలు, పాడి, వ్యవసాయ ఆధారిత పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని.. పోలీసుల హెచ్చరికలు పట్టించుకోకుంటే చర్యలు తప్పవన్నారు. గతంలోనూ పలువురు రైతులు ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు..

వనపర్తి రూరల్: జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసాచారి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాల్‌రెడ్డి సోమవారం ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుళ్ల సమన్వయంతో పనిచేసి బాధితులకు అండగా నిలబడి భరోసా కల్పించాలన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

గౌరి చదువుకు కేటీఆర్ చేయూత

- హైదరాబాద్‌లో రూ.1.65 లక్షల చెక్కు అందజేత
- ‘సాక్షి’కి అభినందనలు తెలిపిన తల్లిదండ్రులు



మాజీ మంత్రి కేటీఆర్‌తో గౌరి, కుటుంబసభ్యులు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు చెందిన బొర్రెల్లి గౌరి ఎంబీబీఎస్ చదువుకు బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆర్థిక చేయూతనందించారు. సోమవారం హైదరాబాద్‌లో రూ.1.65 లక్షల చెక్కును విద్యార్థినికి అందజేశారు. ఇందుకు సహకరించిన ‘సాక్షి’కి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కల్వరాలకు చెందిన బొర్రెల్లి నర్సింహ, శ్యామల కుమార్తె బొర్రెల్లి గౌరి 4వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు భూత్పూర్ సమీపంలోని చిట్టిబోయిన్‌పల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివింది. నీట్‌లో చక్కటి ప్రతిభ కనబర్చి హైదరాబాద్ పటాన్‌చెరువులో ఉన్న మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో కళాశాల ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండగా.. ఈ నెల 10న ‘సాక్షి’ దినపత్రికలో ‘చదువుల తల్లిని ఆదుకోరూ..’ శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కేటీఆర్ మొదటి సంవత్సరం ఫీజు రూ.1.65 లక్షల చెక్కును హైదరాబాద్‌లో విద్యార్థినికి అందజేశారు. మొదటి సంవత్సరం చదువు పూర్తయ్యేందుకు దాతలు మరింత సాయం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బంద్ సైరన్..!

నేటి నుంచి డిగ్రీ కళాశాలలు మూసివేత

- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం నిర్ణయం
- సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో యాజమాన్యాలు
- ఇటు ప్రభుత్వం, అటు విద్యార్థుల నుంచి రాకపోవడంతో మరిన్ని కష్టాలు
- విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు
- పీయూ పరిధిలోని 59 కళాశాలల్లో 28 వేల మంది విద్యార్థులు



పీయూ సిబ్బందికి బంద్ నోటీసులు ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘాల నాయకులు (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు గతంలో ఎప్పుడూ లేని విధంగా నిరవధిక బంద్‌కు దిగాయి. ఈ నెల 5 నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించగా.. మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం పిలుపుమేరకు మంగళవారం నుంచి నిరవధిక బంద్‌కు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు అన్ని ప్రైవేట్ కళాశాలల ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశాయి. అయితే ప్రభుత్వం 2021– 22 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదు. దీంతో కళాశాలలు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒక్కో కళాశాల నిర్వహణకు ప్రతినెలా రూ.7–10 లక్షల భారం పడుతున్నట్లు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఏకంగా మూడేళ్ల నుంచి నిధులు రాకపోవడంతో సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని, ప్రభుత్వం వెంటనే ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేసే వరకు నిరవధికంగా కళాశాలలు మూసివేస్తున్నట్లు యాజమాన్యాల సంఘాలు తెలపగా.. యూనివర్సిటీ అధికారులు మాత్రం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తరగతులు, పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచిస్తోంది.

నిర్వహణ భారం..

ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల ద్వారా ఫీజులు వసూలు చేసి కళాశాలలు నిర్వహించాల్సి ఉంది. గతంలో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. అయితే మూడేళ్లుగా వాటిని చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులతో ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశాక, తీసుకున్న ఫీజులు విద్యార్థులకు తిరిగి ఇస్తారు. వీటి ద్వారా కళాశాలకు కొద్దిపాటి ఆదాయమే వచ్చేది. కానీ, గత ఆగస్టులో ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులు గురిచేయకుండా నేరుగా సర్టిఫికెట్లు ఇవ్వాలని సూచిస్తూ ఆదేశాలు జారీచేసింది. దీంతో ఇటు విద్యార్థుల నుంచి ఫీజులు రాక, అటు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో నిర్వహణ ఇబ్బందికరంగా మారింది.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

పీయూ పరిధిలో మొత్తం 59 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా.. 28 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే వీరికి సంబంధించి మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సుమారు రూ.35– 40 కోట్ల వరకు బకాయి ఉన్నట్లు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. అలాగే విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు సుమారు రూ.25 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమాచారం. ఇలా ఒక్కో కళాశాలకు సుమారు రూ.50– 60 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలుస్తుంది. దీంతో రీయింబర్స్‌మెంట్ పథకం పరిస్థితి ఏమిటని యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి..



డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా ప్రభుత్వం 2021– 22 విద్యా సంవత్సరం నుంచి ఫీజులు చెల్లించాల్సి ఉంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కనీసం నిధులు విడుదలై టోకెన్ ఇచ్చి ఈ–కుబేర్ పెండింగ్‌లో ఉన్నవి అయినా విడుదల చేస్తే ఇబ్బందులు తగ్గుతాయి. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

– నారాయణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం



మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాల వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


తరగతులు నిర్వహించాలి..



ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వీటిని ఉన్నత విద్యామండలి, ప్రభుత్వానికి పంపించాం. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే అవకాశం ఉంది. పరీక్షలు, విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాజమాన్యాలు తరగతులు నిర్వహించాలి.

– మధుసూదన్‌రెడ్డి, పీయూ రిజిస్ట్రార్

వినతిపత్రాలు అందజేస్తాం..



ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నాం. దీంతో కళాశాలల నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. వివిధ దశల్లో అధికారులు, ప్రభుత్వ పెద్దలకు సమస్య వివరించినా ఫలితం లేకపోవడంతోనే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బంద్ చేపడుతున్నాం. నిరవధిక బంద్‌లో రోజుకో కార్యక్రమం నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తాం.

– జయరామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం

క్లుప్తంగా

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన వివాహిత జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన బుడుగజంగం సుందరయ్య తన కుమార్తె బుడుగజండం అలివేల(32)ను మహబూబ్‌నగర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విట్టల్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా విట్టల్ కొన్నాళ్ల నుంచి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో తరుచు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నారు. భర్త వేధింపులకు తాళలేక అలివేల ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఈక్రమంలో ఆదివారం రాత్రి అలివేల కుటుంబసభ్యులు ఊర్లోనే మరొకరి ఇంటి వద్ద పుట్టిన రోజు వేడుకకి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చిన పడుకున్న తర్వాత సోమవారం ఉదయం ఇంట్లో అలివేల కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఊరంతా వెతుకుతుండగా ఊరికి సమీపంలో ఉన్న ఊర చెరువులో మహిళ మృతదేహం కనిపిస్తుందన్న విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి చూడగా అలివేలుగా గుర్తించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.

మార్చురీలో మహిళ మృతదేహం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మహిళ మృతదేహం మార్చురీలో ఉంచినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఈ నెల 1వ తేదీన గుర్తు తెలియని మహిళ తీవ్ర ఆరోగ్యంతో జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. చికిత్స పొందుతూ ఆమె ఈ నెల 3న చనిపోయింది. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో మార్చురీలో భద్రపరిచారు. చికిత్స సమయంలో ఆమె దేవరకద్ర మండలం పేరూరు గ్రామానికి చెందిన తెలుగు కవితగా ఆస్పత్రిలో చెప్పినట్లు పోలీస్‌సిబ్బంది పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


చిన్న రంగస్వామి (ఫైల్)

మల్దకల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి సోమవారం చికిత్స పొందుతూ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఏఎస్ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. ఎల్కూరుకి చెందిన పూజారి బోయ చిన్న రంగస్వామి (70) శనివారం మల్దకల్‌లో జరిగే సంతకు తన మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మార్గమధ్యలో ఎద్దులగూడెం గ్రామం వద్ద కుక్కలు అకస్మాత్తుగా అడ్డువచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి ఆయన కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆయన మృతి చెందారు. అతడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

రైలు ఢీ.. వంట మాస్టర్ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: మతిస్థితమితం సరిగా లేని, చెవులు సక్రమంగా వినిపించని ఓ వ్యక్తి పట్టాలు దాటుతుంటే రైలు వేగంగా ఢీకొట్టడంతో తల పగిలిపోయి అక్కడిక్కడే ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కోయిలకొండ ఎక్స్ రోడ్‌లో నివాసం ఉండే బండిరాజు(35) పట్టణంలోని టీటీ గుట్ట దగ్గర రైలు పట్టాలు దాటుతుంటే రైలు వేగంగా ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడు బండి రాజు తల్లి దగ్గర ఉంటూ వంట మాస్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి మతిస్థిమితం సక్రమంగా లేకపోవడం, చెవులు సక్రమంగా వినిపించవు, పైగా కల్లు అధికంగా తాగి ఇంటికి వెళ్లడానికి పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వంట చేస్తుండగా చీరకొంగు అంటుకుని..

- వృద్ధురాలు మృతి

మాగనూర్: కొల్పూర్‌నకు చెందిన సాయమ్మ(60) ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తీవ్రగాయాలు కాగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం ప్రకారం.. సాయమ్మ గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసేది. ఈమెకు ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహం చేసింది. అప్పటి నుంచి ఆమె ఒక్కతే ఒంటరిగా ఉంటూ జీవనం సాగించేది. ఆదివారం ఉదయం ఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె చీర కొంగుకు నిప్పు అంటుకుంది. ఒక్కసారిగా మంటలు ఎక్కువ కావడంతో ఆమె కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి మంటల ఆర్పివేశారు.. కానీ అప్పటికే ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను కుమార్తెల సాయంతో మక్తల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సాయమ్మ కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం


దసరా రోజున పల్లకీసేవలో డీజీపీ జితేందర్


తెప్పోత్సవానికి హాజరైన భక్తులు

- పాల్గొన్న డీజీపీ, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, సినీ ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయి. రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం కావడంతో ఈ ఏడాది ప్రముఖులు భారీగా వచ్చి దర్శించుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున తరలివచ్చారు. డీజీ జితేందర్, ఐజీ రమేష్‌రెడ్డి దసరా రోజున కుటుంబంతో రాగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డీజీపీ సాధారణ భక్తుడిలా అందరితో కలిసి అమ్మవారి పల్లకీ మోశారు. అదేవిధంగా మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి, హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్, ఎమ్మెల్యేలు, పలువురు సినీ ప్రముఖులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ తదితరులు ఆలయాలను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

అంతా అమ్మవారి చలువే..!



జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయి. ఆలయం తరఫున ఆహ్వానించిన అతిథులందరూ హాజరయ్యారు. సీఎం కుటుంబ సభ్యులు కూడా చండీహోమాలు చేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై రోజు కలెక్టర్ గైడెన్స్ చేశారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతోనే ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ఇదంతా అమ్మవారి చలవే..

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

ప్రశాంతంగా దర్శించుకున్నాం



ఈ ఏడాది ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ప్రవేశటికెట్, తోపులాట లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకున్నాం. తెప్పోత్సవం కూడా చాలా బాగా చేశారు. శక్తిపీఠం ఉమ్మడి జిల్లాలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం.

– నవీన్ వంకరమణి, భక్తుడు, మహబూబ్‌నగర్

ఏర్పాట్లు బాగున్నాయి..



బ్రహ్మోత్సవాల నిర్వహణపై ముందస్తుగా అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పక్కా ప్రణాళికలతో ముందుకెళ్లాం. ఎంతోమంది ప్రముఖులు, వేలాది మంది భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. ఏర్పాట్లు చాలా బాగున్నాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు ముగిశాయి.

– బీఎం సంతోష్‌కుమార్, కలెక్టర్

సిబ్బంది పనితీరు భేష్..



ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అలాగే రోజు ఎంతోమంది ప్రముఖులు ఆలయాలను దర్శించుకున్నారు. చివరిరో జు డీజీపీ, ఐజీ వచ్చి వెళ్లారు. సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం చక్కగా పని చేసింది.

– తోట శ్రీనివాసరావు, ఎస్పీ

పోటీల్లో క్రీడాస్ఫూర్తి కనబర్చాలి

- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: ఆటల్లో క్రీడాస్ఫూర్తి గొప్పదని.. దానికి లోబడే క్రీడాకారులు వ్యవహరించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు సోమవారం జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఆవరణలో ప్రారంభం కాగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని తెలిపారు. కృషి, పట్టుదల ఉంటే విజయాలు దరి చేరుతాయని.. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ మాట్లాడుతూ.. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకుసాగాలన్నారు. జిల్లా పేరును రాష్ట్రం, జాతీయస్థాయిలో నిలిపేలా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, పోటీల పరిశీలకుడు పాల్, కన్వీనర్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, రామన్‌గౌడ్, ఉరుకుందు, మురళి తదితరులు పాల్గొన్నారు.

అదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు శుభారంభం

మొదటిరోజు అదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు శుభారంభం చేశాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతున్నాయి. మొదటి మ్యాచ్‌లో అదిలాబాద్–కరీంనగర్ జట్లు తలపడ్డాయి. కరీంనగర్ జట్టు 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 66 పరుగులు చేసింది. 67 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన అదిలాబాద్ జట్టు అయిదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

- మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో హైదరాబాద్–వరంగల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 12 ఓవర్లలో 47 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 9 ఓవర్లలోనే విజయ లక్ష్యాన్ని ఛేదించింది.
- మూడో మ్యాచ్‌లో రంగారెడ్డి–నిజామాబాద్ జట్లు తలపడ్డాయి. రంగారెడ్డి జట్టు నిర్ణీత ఓవర్లలో 136 పరుగులు చేసింది. భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన నిజామాబాద్ జట్టు 43 పరుగులు మాత్రమే చేసి చతికిలపడింది. రంగారెడ్డి జట్టు క్రీడాకారుడు సాయిప్రదీక్‌రెడ్డి 68 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.


రంగారెడ్డి–నిజామాబాద్ జట్ల మధ్య పోటీ

28 తులాల బంగారం అపహరణ

- చోరీలకు అడ్డాగా మారిన మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్
- ఒకేరోజు టూటౌన్‌లో మూడు కేసుల నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: దసరా పండగ సందర్భంగా మహబూబ్‌నగర్ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంది. ఈ క్రమంలో దొంగలు తమ చేతికి పని చెప్పి భారీ మొత్తంలో ప్రయాణికుల నుంచి బంగారం అపహరించారు. ఒకేరోజు టూటౌన్ పోలీస్‌స్టేషన్ మూడు కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మూడు కేసుల్లో 28 తులాల బంగారం మాయం చేశారు. గతంలోనూ ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగతనాలు జరిగిన ఇప్పటి వరకు కట్టడి చేయలేకపోతున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు నష్టపోవాల్సి వస్తుంది. బస్టాండ్‌లో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడంతోపాటు రక్షణ చర్యలు కనిపించవు. దీంతో జేబు దొంగల నుంచి బంగారం దొంగల వరకు ప్రతిఒక్కరూ రెచ్చిపోతున్నారు.

కేసుల వివరాలు ఇలా..

ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తి భారీస్థాయిలో బంగారం అపహరించాడు. టూటౌన్ ఎస్ఐ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం.. మరికల్ మండలం చిత్తనూర్ గ్రామానికి చెందిన సుధారాణి సోమవారం సాయంత్రం 5.40 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి చిత్తనూర్ వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్‌లో రాయిచూర్ బస్సు ఎక్కింది. ఆ తర్వాత టికెట్ తీసుకునే క్రమంలో ఆధార్‌కార్డు కోసం బ్యాగ్ చూసుకోగా లోపల ఉన్న చిన్నపర్స్ కనిపించలేదు. పర్స్‌లో ఉన్న 8 తులాల బంగారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

- ఓ మాజీ ఆర్మీ సిబ్బంది హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం అపహరించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. నరేష్ అనే వ్యక్తి మాజీ ఆర్మీ ఉద్యోగి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా దసరా పండగ కోసం ఈ నెల 9న హైదరాబాద్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. ఆ తర్వాత మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి హన్వాబాద్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ఇంటికి వెళ్లిన తర్వాత ఈ నెల 11న సాయంత్రం ఆలయానికి వెళ్లడానికి ముందు బ్యాగ్‌లో ఉన్న బంగారం చూసుకోగా కనిపించలేదు. బ్యాగ్‌లో ఉన్న 14 తులాల బంగారం, 60 గ్రాముల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.
- దసరా పండగకు తల్లి ఇంటికి వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న ఓ మహిళ బ్యాగ్‌లో నుంచి బంగారం, ఏటీఎం కార్డు అపహరించారు. టూటౌన్ ఎస్ఐ ఓబుల్‌రెడ్డి కథనం ప్రకారం.. కోస్గి సువర్ణ అనే మహిళ హైదరాబాద్‌లోని చింతలబస్తీలో ఉంటూ సీఎం నివాసంలో పని చేస్తోంది. అయితే దసరా పండగ కోసం ఈ నెల 12న గండేడ్ మండలం కొండారెడ్డిపల్లిలో ఉన్న ఆమె తల్లి ఇంటికి వచ్చింది. తిరిగి సోమవారం హైదరాబాద్ వెళ్లడానికి మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్‌కు రాగా ఇద్దరు పిల్లలతో ఆమె హైదరాబాద్ బస్సు ఎక్కింది. ఆ తర్వాత బ్యాగ్ చూసుకోగా జిప్ ఓపెన్ చేసి ఉండటంతో లోపల ఉన్న ఆరు తులాల బంగారం, ఏటీఎం కార్డును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై లైంగికదాడి: కేసు నమోదు

తెలకపల్లి: మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఆదివారం పొలం పనులు ముగించుకొని సాయంత్రం ఇంటి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బింగి మల్లేష్ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బింగి మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మంగనూర్ శివారులోని కేఎల్ఐ కాల్వలో పడి గల్లంతైన వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్డెమాన్‌కు చెందిన ఈర్ల రాములు(35) ఆదివారం బైక్‌పై గౌరారం వెళ్తుండగా ప్రమాద వశాత్తు కాల్వ బ్రిడ్జిని ఢీకొని కేఎల్ఐ కాల్వలో పడిపోయాడు. ఈ విషయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం మృతదేహాన్ని బయటికి తీశారు. బంధువులు ఈర్ల రాములు మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డిని వివరణ కోసం పలు మార్లు ప్రయత్నించగా స్పందించలేదు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సోమవారం సల్కర్‌పేటలో చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. సల్కర్‌పేటకు చెందిన శిరీష(22) కుటుంబ కలహాల వల్ల ఈనెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నాగర్‌కర్నూల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సుంకేసులలో 22 గేట్ల ఎత్తివేత


సుంకేసుల నుంచి దిగువకు పారుతున్న వరద నీరు

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. సోమవారం 92,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అధికారులు 22 గేట్లను తెరిచి 90,494 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అలాగే కేసీ కెనాల్ 1,540 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన వాహనం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తదితరులు

ఖిల్లాఘనపురం: మండలంలోని ఓ రైస్‌మిల్ వద్ద రేషన్ బియ్యాన్ని సోమవారం జిల్లా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. సీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, మండల పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని రేషన్ దుకాణ యజమాని చంద్రశేఖర్ వద్ద పుల్లూరు రాజు, పుల్లూరు వెంకటేష్ 19 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి మారుతి వ్యాన్‌లో ఉదయం 5.30 గంటల సమయంలో మండలంలోని హన్‌పాడు శివారులో ఉన్న దివ్యనవ్య రైస్‌మిల్ లోనికి తీసుకెళ్లారు. పక్కా సమాచారంతో అక్కడే కాపు కాస్తున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. వ్యాన్‌లో 19 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై బొట్టు శ్రీనుతో పాటు సిబ్బంది మిల్లు వద్దకు రాగా వారికి బియ్యం అప్పగించి వెళ్లిపోయారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ వచ్చి పంచనామా నిర్వహించారు. అనంతరం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు, బియ్యాన్ని వనపర్తికి తరలించారు. రైస్‌మిల్ యజమాని భర్త లక్ష్మీనారాయణ, బియ్యం తీసుకొచ్చిన పుల్లూరు రాజు, పుల్లూరు వెంకటేష్పై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

గద్వాల క్రైం: రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుచగా, వారికి రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 10న గద్వాల మండలం పూడూర్‌లో బీచుపల్లి, బోయ రాఘవేంద్ర ఇళ్లల్లో చొరబడి బీరువాలో తులం బంగారం అపహరించాడు. బాధితులు అనుమానిత వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేయగా నేరం అంగీకరించాడు. ఈ మేరకు కోర్టులో హాజరు పరుచగా రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మూడు రోజుల క్రితం మల్దకల్ మండలానికి చెందిన జంగయ్య (జనార్దన్) అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా, పూడూరు శివారులో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తిలో రసం పీల్చే పురుగు నివారిద్దాం!


పత్తి పంట సాగు చేసిన దృశ్యం


బొట్టు పెట్టె పద్ధతి

అధికారి సలహా
సక్రియ నాయక్
డీఏఓ, జోగుళాంబ గద్వాల జిల్లా

అలంపూర్: పత్తి సాగులో ముఖ్యంగా బీటీ పత్తిలో రసం పీల్చే పురుగులు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. అన్నీ ప్రైవేట్ కంపెనీలు విత్తన శుద్ధి చేస్తాయి. విత్తనశుద్ధి వల్ల మొదటి 20 రోజుల వరకు పత్తి మొక్కలకు రసం పీల్చే పురుగులను తట్టుకోనే శక్తి ఉంటుంది. ఆ తర్వాత వాటికి వివిధ ఖరీదైన మందులు పిచికారీ చేసే బదులు తక్కువ ఖర్చుతో కాండానికి మందు పూసి లేదా బొట్టు పెట్టి పురుగులను నియంత్రించ వచ్చని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు వివరించారు.

బొట్టు పద్ధతి వల్ల లాభాలు..

- పెట్టుబడి తగ్గుతుంది. మిత్ర పురుగులు చనిపోకుండా ఉంటాయి. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది.
- రసం పీల్చే పురుగులను నియంత్రించ వచ్చు.
- పెట్టుబడిలో పురుగు మందుల ఖర్చు తక్కువగా ఉంటుంది.

ఎలా చేయాలి..

- ఒక వంతు మోనోక్రోటోపాస్ మందు తీసుకోని దానికి నాలుగు వంతుల నీరు కలుపుకోవాలి. ఉదాహరణకు 100 మి.లీ. మోనోక్రోటోపాస్ మందు తీసుకుంటే 400 మి.లీ. నీరు కలపాలి.
- ఈ మందు మిశ్రమాన్ని వేప పుల్లతో లేదా కాండానికి మందు పెట్టే బ్రష్‌తో (మార్కెట్‌లో లభిస్తోంది) మొక్క కాండంపై ఎరుపు రంగుపైన లేత ఆకు పచ్చగా ఉన్న కాండంపై పూతగా బొట్టు పెట్టాలి.
- ఇలా 20 రోజుల వ్యవధిలో రెండు మార్లు చేస్తే పత్తి పంటను 60 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయకుండానే కాపాడుకోవచ్చు. నాటిన 20,40,60 రోజులకు ఒకసారి ఈ పద్ధతి పాటించాలి.
- అవసరాన్ని బట్టి వేప కషాయం 5 శాతం లేదా వేప నూనె (1500 పీపీఎం) మందును లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్లు కలిపి సాయంత్రం సమయాల్లో పంటపై పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు.
- ఈ రెండు విధానాలను పాటించడం వల్ల కీడు చేసే పురుగులు నశించి మేలు చేసే మిత్ర పురుగులు బతికి ఉంటాయి. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట చేతికి వస్తుంది.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చిన్నంబావి: పెద్దమారుకి చెందిన చంద్రారెడ్డి(55) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. చంద్రారెడ్డి తన ఇంట్లో కరెంట్ వైరుతో ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు లు మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం కోసం కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతిపై అనుమానం ఉందని సోదరుడు బిచ్చారెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎంపీ డా. మల్లు రవికి సన్మానం



పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లురవిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, డీసీసీబీ చైర్మన్ మామిళ్ల పల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరుకావాల్సిందిగా ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్యసాగర్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు రవికుమార్, జయరాములుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో సోమవారం భక్తులు హోమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పురవీధుల గుండా మహిళలు కోలాటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి శోభాయాత్ర చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గీత కార్మికుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడు అన్నారు. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు సత్తూరి చంద్రభాస్కర్‌గౌడ్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన సోమవారం గ్రామానికి చేరుకొని మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో దొండాయిపల్లి మాజీ సర్పంచ్ జనార్దన్‌గౌడ్, నరేందర్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, గురువయ్యగౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్యార్వి ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణంలోని మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు సోమవారం సోమవారం గంధోత్సవంతో నిర్వాహకులు జిలాని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉర్సోత్సవాల సందర్భంగా మంగళవారం దర్గా వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామని, భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎస్ఆర్ ప్రేమయ్యకు ఘన నివాళి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో గల అంబేడ్కర్ కాలనీకి చెందిన ధ్యానరత్న అవార్డు గ్రహీత ఎస్ఆర్ ప్రేమయ్య ఈనెల 4న గుండెపోటుతో మృతి చెందారు. ప్రేమయ్య కుటుంబ సభ్యులు సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఎస్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గొల్లబాబు, శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, నంద వెంకటేష్, పి.మోహన్‌రెడ్డి, మిషేక్, ప్రసాద్, ముజీబ్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అభ్యర్థులు విధుల్లోఅంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కానాయపల్లికి చెందిన గొల్ల లక్ష్మి డీఎస్సీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించి ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం కానాయపల్లికి చేరుకుని గొల్ల లక్ష్మిని శాలువాలతో సత్కరించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదువుకొని టీచర్ ఉద్యోగం సాధించడం గ్రామంలోని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో బీచుపల్లియాదవ్, గోకరయ్య, పగ్గాల రాములు, బొజ్జన్న, కరాటే శివ తదితరులు ఉన్నారు.



కానాయపల్లిలో టీచర్ ఉద్యోగం సాధించిన గొల్ల లక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో టీచర్ ఉద్యోగాలు సాధించిన లోడెల సింధు, గోకం ప్రియాంక ను కుర్వ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుర్వ సంఘం గ్రామ అధ్యక్షుడు మోటూరి చంద్రమల్లయ్య, టీచర్ ఆవులబాలయ్య, ఎస్ఐ మోటూరి రాములు, సంఘం నాయకులు, యువత పాల్గొన్నారు.

గోపాల్‌పేట: బుద్దారం గ్రామంలోని ఓ ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలో చదివి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఇద్దరిని సోమవారం పాఠశాల అధ్యాపకులు, స్థానికులు సన్మానించారు. సైన్స్ విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంకుతో ఉద్యోగం సాధించిన మనీష, వద్ది రాము ను యువత స్ఫూర్తిగా తీసుకొని చదవాలని సూచించారు. అనంతరం ఇద్దరికీ చదువు చెప్పిన గురువు రామ్మూర్తిని విద్యార్థులు సన్మానించారు.



బుద్దారంలో..



రేమద్దులలో..

బీజేపీ బలోపేతానికి కృషి

వనపర్తిటౌన్/ఖిల్లాఘనపురం: బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జి.ప్రవీణ్‌కుమార్ నియమితులు కావడంతో నియమాక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ సోమవారం బీజేపీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం కార్యకర్తల ఆమోదం మేరకు జిల్లా అధ్యక్షుడి సమక్షంలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మేతరి శివశంకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి శ్రీశైలం మాట్లాడుతూ మోడీ హయాంలో దేశం పురోగమిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా జాతి గౌరవం పెరుగుతుందన్నారు. అట్టడుగు, అణగారిన వర్గాలకు బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న, నాయకులు విక్రమ్, రామచందర్, గోపి తదితరులు పాల్గొన్నారు.



దళిత మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియామకపత్రం అందుకుంటున్న శివశంకర్

సభ్యత్వ నమోదు

వనపర్తి రూరల్: ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో సమర్థవంతమైన పాలన అందుతుందని వనపర్తి నియోజక వర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ పెబ్బేరు మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేరు మండలంలోని రంగాపురంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగుపాము పట్టివేత



పాన్‌గల్: మండలంలోని చింతకుంట శివారులో శివమ్మ పొలంలో ఉన్న నాగుపామును సోమవారం స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్ బంధించారు. గ్రామానికి చెందిన శివమ్మ పొలంలో మినుమలు విత్తడానికి ట్రాక్టర్ డ్రైవర్ రాముడు దుక్కి సిద్ధం చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ వద్దకు పెద్ద నాగుపాము వచ్చి పడగ విప్పుకొని పెద్ద, పెద్ద శబ్దాలతో బుసలు కొడుతూ అలాగే ఉండిపోయింది. పామును చూసిన మహిళా రైతు శివమ్మ, ట్రాక్టర్ డ్రైవర్ భయంతో వణికిపోయారు. ట్రాక్టర్ ఎటు వెళ్తే నాగుపాము కూడా అటే రావడం.. 40 నిమిషాల పాటు నాగుపాము ట్రాక్టర్ వద్దే ఉండడంతో విషయాన్ని గ్రామానికి చెందిన పరమేష్ అనే యువకుడికి తెలియజేశారు. ఆ యువకుడు స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణసాగర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే గ్రామానికి చేరుకొని నాగుపామును చాకచక్యంగా బంధించారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ మాట్లాడుతూ పాములు ఎక్కువగా ఆకలితో ఉన్న సమయంలో మనుషులను కానీ శబ్దాలను కానీ గ్రహించినా.. పెద్దగా పట్టించుకోకుండా ఆహారంపైనే ఎక్కువ దృష్టి సారిస్తాయన్నారు. అందులో భాగంగానే పొలంలో ట్రాక్టర్ దున్నుతున్న సమయంలో రంధ్రాల నుంచి ఎలుకలు బయటికి రావడంతో మనుషులు ఉన్నా పెద్దగా పట్టించుకోకుండా ఆహారం వెతకడం కోసం నాగుపాము అలానే ఉండిపోయిందన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 50పడకల ఆస్పత్రి భవన నిర్మాణం కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం స్థానిక తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 550లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు. తహీల్దార్ కార్యాలయం పక్కన గల ఈ ప్రభుత్వ భూమిలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తే మదనాపురం, కొత్తకోట మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. స్థలాన్ని పరిశీలించినట్లు నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పి.ప్రశాంత్, గొల్లబాబు, ఎస్‌జే బోయేజ్, కృష్ణారెడ్డి, సుభాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి

ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం

అమరచింత: హక్కులపై ప్రశ్నిస్తున్న మేధావుల గొంతుకలపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం వామపక్ష భావజాలం గల మేధావులు, కవులు, కళాకారులు పోరాడుతున్నారన్నారు. వారిని వామపక్ష తీవ్రవాదులుగా ముద్ర వేసి ఉపా చట్టం కింద జైల్లో పెట్టి వారి చావులకు కారణం అవుతున్నారని మండిపడ్డారు. సాయిబాబా ప్రొఫెసర్‌గా సమాజానికి మేధావులను, విద్యావంతులను అందించారని కొనియాడారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్‌లతో పాటు కుతుబ్, రవీందర్, శ్యాంసుందర్, ఎర్రన్న, సౌలు తోపాటు పలువురు పాల్గొన్నారు.



అమరచింతలో సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూర్: ప్రశ్నించే గొంతుకలను పాలకులు అక్రమంగా నిర్బంధిస్తూ అణగదొక్కుతున్నారని, కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, సీపీఐఎంఎల్ జిల్లాకార్యదర్శి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో ప్రొఫెసర్ సాయిబాబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాబర్టు, సీఎస్ శెట్టి, లక్ష్మీనారాయణ శెట్టి, కుతుబ్, మోష, వెంకటన్న, కుర్మన్న, భరత్ తదితరులు ఉన్నారు.

కాళికాదేవి ఆలయంలో అన్నప్రసాద వితరణ



అమరచింత: మండల కేంద్రంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన కాళికామాత ఆలయంలో సోమవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారికి వడి నింపిన బియ్యంతో భక్తులకు అన్నప్రసాదంగా అందించామని ఆలయ నిర్వాహకులు కొట్టం నాగేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేష్ తెలిపారు. అదే విధంగా అమ్మవారి చీరలను వేలం పాటలో మహిళలు దక్కించుకున్నారన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సవాయిగుడెంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య మాట్లాడుతూ నిషేధ భూములు, లావాణి పట్టా భూముల చట్టాలు, మోటార్ వెహికిల్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదవుతాయని, వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కారన్నారు. డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ వేక్ ఆఫ్ గురించి తెలియజేస్తూ అత్యాశకు పోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి ఓటీపీలు, ఆధార్, అకౌంట్ నెంబర్ చెప్పరాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: వ్యక్తి అదృశ్యం అయిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని చంద్రాయనిగడ్డ కాలనీకి చెందిన పోతురాజు రాజు ఆదివారం ఉదయం వనపర్తికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు, సోమవారం సైతం ఇంటికి రాకపోయేసరికి రాజు భార్య పోతురాజు వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు.

20న ఐఫ్టూ విలీన సభ



అమరచింత: 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం అవుతుందని, ఈమేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న విలీన సభను నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు తెలిపారు. విలీన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 45 కోట్ల కార్మికుల్లో కేవలం 6కోట్ల కార్మికులు మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారన్నారు. మిగితా అసంఘటిత కార్మికులు కడు దరిద్రంలో జీవిస్తున్నారని వాపోయారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ గ్రాట్యుటీ పెన్షన్లు లేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాస్‌లైన్ మండల కార్యదర్శి రాజన్న, సామేలు, భక్తరాజు, ప్రేమరత్నం, బాలస్వామి, రాంచందర్, జిలాని, సత్యన్న, నరసింహ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



గోప్లాపూర్‌లో విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పాన్‌గల్‌లో..

పాన్‌గల్: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని పాన్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి అన్నారు. పాన్‌గల్ ప్రీమియం లీగ్ క్రికెట్ (పీపీఎల్‌సీ) ఆధ్వర్యంలో తాళ్ల శిరీష జ్ఞాపకార్థం దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు సోమవారం నిర్వాహకులతో కలిసి ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఫ్రెండ్స్ లెవన్ జట్టుకు రూ.8 వేలు నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.4వేలు నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో దాతలు తాళలు సింగోటం, హన్మంతు, కళాశాల అధ్యాపక బృందం, నిర్వాహకులు పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో..

మండలంలోని గోప్లాపూర్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్లకు కాంగ్రెస్ నాయకులు పుల్లారావు, సింగిల్ విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,016, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3,016 నగదుతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో దశరథం, రాజుగౌడ్, మల్లేష్‌యాదవ్, బాలస్వామియాదవ్, విష్ణుగౌడ్, కిరణ్‌కుమార్, బాలరాం, మహబూబ్‌అలీ, నరేష్, సాగర్, యువత పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లిలో సుష్మాస్వరాజ్ స్మారక మండల స్థాయి క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి సుష్మాస్వారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజేతగా నిలిచిన ఖిల్లాఘనపురం జట్టుకు రూ.9వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తిర్మలాయపల్లి జట్టుకు రూ.6వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వెంకటాంపల్లి జట్టుకు రూ.3వేల నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బుడగజంగాలు ఆర్థిక పురోగతి సాధించాలి

మదనాపురం: బేడ బుడగ జంగాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ స్వశక్తిపై ముందుకు పోవాలని బేడ బుడగ జంగం యూత్ మండల అధ్యక్షుడు మోతే హుస్సేన్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొన్నూరులో బుడగ జంగాల కుటుంబాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ బుడగ జంగాల స్థితిగతులపై సర్వే నిర్వహించి రాష్ట్ర నాయకత్వానికి అందజేస్తామని, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక సమర్పిస్తారని పేర్కొన్నారు. తమకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత నివ్వాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసమే వాడుకోకుండా ఆర్థిక పురోగతికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి ఆదుకోవాలన్నారు.



కొన్నూరులో సర్వే చేస్తున్న నాయకులు

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

గోపాల్‌పేట: సెల్‌ఫోన్లు చోరీకి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఇటీవల మండలంలో రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురికాగా సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్లు గుర్తించి సోమవారం బాధితులకు అప్పగించామన్నారు. మండల కేంద్రానికి చెందిన కొమారి యాదగిరికి జూన్‌లో, ఏదుట్లకు చెందిన చొక్కొంద్ర రాజమల్లు సెప్టెంబర్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. రెండు ఫోన్లను ట్రాకింగ్‌లో పెట్టి సీఈఐఆర్ ద్వారా గుర్తించి, రికవరీ చేశామని ఎస్ఐ వివరించారు.

రేవల్లి మండలంలో..

రేవల్లి మండల కేంద్రానికి చెందిన క్రిష్ణయ్య ఇటీవల తన ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి సోమవారం బాధితుడు క్రిష్ణయ్యకు అప్పగించామని రేవల్లి ఎస్ఐ రాము తెలిపారు.



గోపాల్‌పేట పీఎస్‌లో బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం



మదనాపురం: మండలంలోని తిరుమలాయపల్లికి చెందిన గద్దమీది లావణ్య, రాములు దంపతుల కుమారుడు సాకేత్ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో సోమవారం బీఆర్ఎస్ నాయకులు విద్యార్థిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గొప్ప డాక్టర్‌గా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ శ్రవణ్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గన్నేపల్లి మనోజ్‌కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ రాంనారాయణ, నాయకులు ఆవుల బాలకృష్ణ, కోట్ల తిరుపతయ్య, రవికుమార్, మేకల రమేష్ యాదవ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ప్రయాణికుల పాట్లు



అయిజ: ప్రయాణికులు అర్ధరాత్రి ప్రయాణం చేసి గమ్యం చేరుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు రాత్రి 11గంటలకు అయిజ నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. దసరా పండుగ ముగించుకున్న ప్రజలు ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణం చేసేందుకు రాత్రి 11గంటల బస్సుకోసం సుమారు 100 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు రాగానే సీట్ల కోసం చిన్నపాటి యుద్ధం చేశారు. సీట్లు నిండినా సగం మంది ప్రయాణికులు బస్సు చుట్టూ గుమిగూడారు. ఇంకో బస్సును ఏర్పాటు చేయాలని పట్టు బట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ బృందం సంఘటనా స్థలానికి చేరి ప్రయాణికులకు నచ్చచెప్పినా వినలేదు. చేసేదేమీలేక ఆర్టీసీ అధికారులు రెండో బస్సును ఏర్పాటు చేశారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మురళీకృష్ణను వివరణ కోరగా, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి రెండో బస్సును ఏర్పాటు చేసినా ప్రయాణికులు చాలా మంది గద్వాల సమీపంలోని రైల్వే స్టేషన్‌లో దిగిపోయినట్లు తెలిపారు.

ఆవులను గోశాలలకు తరలిస్తాం



పశువుల బందెలో బంధించిన ఆవులు

అయిజ: పశువుల బందెలో ఉన్న ఆవులను వాటి యజమానులు విడిపించక పోకుంటే వాటిని గోశాలలకు తరలిస్తామని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా మేకల నాగిరెడ్డి సోమవారం మాట్లాడారు. మండలంలోని వివిధ శివారుల్లో రైతుల పంట పొలాల్లో ఆవులు సంచరించి పంటలకు నష్టం కలిగించాయని తెలిపారు. పంటలను కాపాడేందుకు ఆవులను మండల కేంద్రంలోని రైతు సంఘం పరిధిలో ఉన్న పశువుల బందెలో బంధించినట్లు తెలిపారు. ఆవుల యజయానులు వెంటనే రుసుం చెల్లించి వాటిని విడిపించుకెళ్లాలని సూచించారు.

పనుల ప్రణాళికలు అందజేయండి

శాంతినగర్: 2025–26 ఏడాదికి సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమావేశం స్థానిక ఐకేపీ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని నర్సరీల్లో పెంచి మిగిలిపోయిన మొక్కలను గ్రేడింగ్ చేసి సిఫ్టింగ్ చేయాలని, ప్రైమరీ బెడ్ల ఏర్పాటు కోసం ఎర్రమట్టిని సిద్ధం చేయాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామాల్లో పనులు గుర్తించి 2025–26 ఏడాదికి ప్లాన్ చేయాలనే అంశాలపై అధికారులకు సూచనలివ్వడమేగాక పనుల విషయమై చర్చించారు. సమావేశంలో ఏపీఓ కుమార్, ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

‘ముఖ్య’నేత మాటే ఫైనల్..
మాఫియాదే రాజ్యం

ఎల్లో సిండికేట్‌కే మద్యం దుకాణాల కేటాయింపు
లాటరీ ప్రక్రియను హైజాక్ చేసిన పచ్చ మురాలు

- ఏకపక్షంగా 80 శాతం మద్యం షాపుల లైసెన్సులు హస్తగతం
- బెదిరింపులతో మిగతా 20% లైసెన్సులు కబ్జా
- ఈ అక్రమాలకు వత్తాసు పలికిన అధికార యంత్రాంగం
- మహిళల పేరుతో 345 మద్యం షాపుల లైసెన్సులు
- మొత్తం 3,396 దుకాణాలు టీడీపీ సిండికేట్ గుప్పిట్లోనే

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కేడర్ వివాదం మళ్లీ క్యాట్‌కు..

ఐఏఎస్‌లు ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన పిటిషన్లు
కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పుకు విరుద్ధమని వెల్లడి • నేడు విచారణ చేపట్టనున్న క్యాట్ ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తలెత్తిన ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపు వివాదం మళ్లీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)కు చేరింది. కేడర్ కేటాయింపుల మేరకు ఎక్కడి వారక్కడ విధుల్లో చేరాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం (డీవోపీటీ) ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, జి.సృజన క్యాట్‌లో సోమవారం వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఐదు పిటిషన్లపై మంగళవారం లతా బస్వరాజ్ పట్నే (జ్యుడీషియల్), షాలినీ మిశ్రా(అడ్మినిస్ట్రేషన్) ధర్మాసనం విచారణ చేపట్టనుంది. తమను ఏపీ కేడర్‌కు బదులుగా తెలంగాణ కేడర్‌కు కేటాయించాలన్న ఏడుగురు ఐఏఎస్, ఇద్దరు ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులను తిరస్కరిస్తూ కేంద్రం గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా తమను తెలంగాణ కేడర్‌కు బదులు ఏపీ కేడర్‌కు కేటాయించాలన్న మరో ముగ్గురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తులనూ తిరస్కరించింది. తక్షణమే ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్ర కేడర్ నుంచి రిలీవ్ కావాలని, ఈనెల 16లోగా కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలని వారిని ఆదేశించింది. అయితే, కేంద్రం నిర్ణయం హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందంటూ అధికారులు మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. తమను తెలంగాణలోనే కొనసాగించాలని ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్ కోరుతుండగా, తనను ఏపీలోనే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సృజన కోరుతున్న విషయం విదితమే.

పదేళ్లుగా వివాదం

2014లో ఉమ్మడి ఏపీ విభజన సమయంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో ఏపీకి కేటాయించిన అధికారుల్లో కొందరు క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ తెలంగాణలో విధులు నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో తెలంగాణ సీఎస్‌గా పని చేస్తున్న సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం 2023, జనవరిలో తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారించాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. ఈ వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగిస్తూ 2024, జనవరి 3న కీలక తీర్పు వెలువరించింది. అయితే అధికారుల అభ్యంతరాలను పరిశీలించాలని, స్థానికత, 10 ఏళ్ల సర్వీస్, ఇంకా మిగిలి ఉన్న సర్వీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో కేంద్రం ఏర్పాటు చేసిన దీపక్ ఖండేకర్‌కమిటీ అధికారుల విజ్ఞప్తులను పరిశీలించి.. వాటిని తోసిపుచ్చుతూ ఎక్కడి వారు అక్కడికే వెళ్లాలని నివేదిక ఇచ్చింది. కేంద్రం ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీన్ని అధికారులు తాజాగా క్యాట్‌లో సవాల్ చేశారు.

సీఎస్ శాంతికుమారితో భేటీ

మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్.. సోమవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిశారు. కేంద్ర ఉత్తర్వులు, క్యాట్‌లో పిటిషన్ల నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

నేవీ రాడార్‌కు నేడే భూమిపూజ

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలవగా.. ప్రస్తుతం అన్ని అనుమతులు పొంది, పనుల ప్రారంభానికి సిద్ధమైంది. దీని నిర్మాణం కోసం రిజర్వ్ ఫారెస్టులోని 2,900 ఎకరాల భూమిని నేవీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

అనువైన ప్రాంతం కావడంతో..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉండటం, సముద్ర మట్టానికి 350 మీటర్లకుపైగా ఎత్తులో, అడవి మధ్యలో ఉండటంతో.. రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం దామగుండం ప్రాంతాన్ని నేవీ ఎంచుకుంది. ఈ రాడార్ స్టేషన్ ద్వారా దేశ తూర్పు నావికాదళం సబ్‌మెరైన్స్‌కు సంకేతాలు అందించనున్నారు. రూ.3,200 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్టు అధికారులు చెప్పున్నారు. పనుల శంకుస్థాపన ఏర్పాట్లను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.

ఎన్నో ఆందోళనల మధ్య..

దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు వల్ల అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాడార్ స్టేషన్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. వేల ఎకరాల భూమిని చదును చేసే పనుల్లో అనేక రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు ధ్వంసమవుతాయంటూ కొందరు ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయంగా అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాడార్ స్టేషన్ ఏర్పాటుపై ముందుకు వెళ్లాయి.

రాడార్ స్టేషన్‌ను అడ్డుకుందాం..

- ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

పంజగుట్ట (హైదరాబాద్): వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న రాడార్ స్టేషన్ ప్రాజెక్టు కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలతో పాటు హైదరాబాద్‌లోని వరదలను మరింత తీవ్రతరం చేస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకోసం 2,900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేస్తున్నారని, సుమారు 12 లక్షల జీవవైవిధ్యం ఉన్న చెట్లను నరికేందుకు చూస్తున్నారని, యావత్ తెలంగాణ సమాజం దీన్ని అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ‘దామగుండం విధ్వంసంపై పౌరసమాజం స్పందన’ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీవోడబ్ల్యూ సంధ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, పర్యావరణవేత్త బాబూరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గోవర్ధన్, జర్నలిస్టులు విఠల్, తులసీచంద్, బక్క జడ్సన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సేవ్ దామగుండం పేరుతో దేశవ్యాప్తంగా 18 ప్రధాన పట్టణాల్లో ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

నైపుణ్యం సాధిస్తేనే విద్యార్థులకు గుర్తింపు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం: నేటి తరం గ్రాడ్యుయేట్లు అంకితభావంతో చదువుతూ ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) క్యాంపస్‌లో సోమవారం స్నాతకోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ఎదుగుదలకు కలలు కనాలని, వాటిని సార్థకం చేసుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడారు.

అప్పుడు ఆమోదం.. ఇప్పుడు రాజకీయమా ?

- దామగుండం ప్రాజెక్టును కేటీఆర్ వ్యతిరేకించడంపై ప్రభుత్వవర్గాల మండిపాటు

సాక్షి, హైదరాబాద్: అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రంగారెడ్డి జిల్లా పూడూరులో వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన విషయాన్ని ప్రభుత్వ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో 1174 హెక్టార్ల భూమిని ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు బదిలీ చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2017 డిసెంబర్ 12న జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. అయితే ఇప్పుడు మాజీమంత్రి కేటీఆర్ వ్యతిరేకించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టును వ్యతిరేకించడం, ముందుగా ఆమోదించి ఇప్పుడు రాజకీయం చేయటం కేటీఆర్ నిజస్వరూపాన్ని తెలియజేస్తోందని మండిపడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశ భద్రత ప్రాధాన్యం దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతునిచ్చారని పునరుద్ఘాటించాయి. 2017 మార్చి 2న నేవీ విభాగం రాష్ట్ర అటవీశాఖకు పంపిన డిమాండ్ నోటీసు ప్రకారం రూ.133.54 కోట్లు ఖాతాలో జమ చేసిందని, 2017 డిసెంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం అటవీ భూములను నేవీకి బదిలీ చేస్తూ జీవో నెం.44 జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశాయి. 2017 డిసెంబర్ 22న తుది అనుమతులకు సంబంధించిన జీవో సంబంధిత జిల్లా అటవీ అధికారికి చేరిందని తెలిపాయి.

ఓ వైపు మరణ శాసనం.. మరోవైపు సుందరీకరణా?

- వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్‌తో మూసీ నది అంతర్ధానం: కేటీఆర్
- పదేళ్లు ఒత్తిడి తెచ్చినా మేము నిర్మాణానికి అంగీకరించలేదు
- ద్వీపాల్లో ఉండాల్సిన రాడార్ స్టేషన్ తెలంగాణలోనా?
- ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు?
- పర్యావరణవేత్తలతో కలిసి ఉద్యమిస్తాం



సాక్షి, హైదరాబాద్: నౌకాదళానికి చెందిన రాడార్ స్టేషన్ ఏర్పాటు పేరిట ఓ వైపు మూసీ నదికి మరణం శాసనం రాస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోవైపు సుందరీకరణ పేరిట హడావుడి చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది అంతర్ధానమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లు తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా రాడార్ స్టేషన్ నిర్మాణానికి అంగీకరించలేదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ ప్రకటించారు.

ప్రమాదంలో మూసీ నది

‘వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నౌకాదళానికి సంబంధించిన వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ నది ప్రమాదంలో పడుతుంది. ఓ వైపు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడతామంటూనే.. మరోవైపు రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం రేవంత్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఏం ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో సీఎం చెప్పాలి. ఈ నెల 15న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయడంపై బీఆర్‌ఎస్ నిరసన తెలుపుతుంది. దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటుతో 2,900 ఎకరాల అటవీ భూమి, 12 లక్షల చెట్లను నష్టపోతాం. జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను తెలంగాణలో ఎందుకు నిర్మిస్తున్నారో చెప్పాలి’ అని కేటీఆర్ అన్నారు.

మూసీ నది ఎకో-సెన్సిటివ్ జోన్ కాదా?

‘గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించింది. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం ఉంది. అలాంటప్పుడు మూసీ నది జన్మస్థానాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించాలి. గంగా నదికి ఒక న్యాయం.. మూసీకి మరో న్యాయమా? రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణ సమతుల్యతకు ప్రమాదం పొంచి ఉంది. మూసీ పేరిట రూ.వేల కోట్ల దోపిడీ చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ స్టేషన్‌ను దామగుండంలో ఏర్పాటు చేయడాన్ని అంగీకరించం. పర్యావరణ వేత్తలతో కలిసి పోరాటం చేస్తాం’ అని కేటీఆర్ పేర్కొన్నారు.



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు/ దోమలపెంట/ ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 58,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 38,499 క్యూసెక్కులు, రెండు గేట్ల ద్వారా 14,128, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 94 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.909 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి 46,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.145 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

508 మి.యూ., విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. సోమవారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల ఉత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 508.238 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు.

శ్రీశైలానికి 1,43,121 క్యూసెక్కులు..

జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 14,128 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 38,499, సుంకేసుల నుంచి 90,494 మొత్తం 1,43,121 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,642 మొత్తం 65,957 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,575 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్‌ఐకి నీటి విడుదల జరగలేదు. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 882.5 అడుగుల వద్ద 202.0439 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ఆర్టీసీలో దసరా జోష్



హైదరాబాద్ బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు

- బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు
- రాష్ట్రంలోనే ఓఆర్‌లో రీజియన్ మొదటిస్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో దసరా జోష్ నెలకొంది. ఈ ఏడాది దసరా పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌లో 649 ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులను నడిపారు. రీజియన్‌లోని పది డిపోల నుంచి ఈనెల 1వ తేదీ నుంచి 11 వరకు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. హైదరాబాద్ రూట్లో ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.

ఈనెల 1 నుంచి 11 వరకు అధిక ఈపీకే, ఓఆర్ సాధించిన డిపోలు

డిపో	ఈపీకే	ఓఆర్
నాగర్‌కర్నూల్	67.1	114.3
వనపర్తి	65.35	110.69
గద్వాల	63.67	108.62

తిరుగు ప్రయాణంలో ప్రత్యేక అదనపు సర్వీసులు

దసరా పండుగ సెలవులు ముగుస్తుండడంతో గత రెండు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. చాలా మంది ప్రయాణికులు రెండు రోజుల ముందే తిరుగుబాట పట్టారు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. రద్దీ మేరకు తిరుగు ప్రయాణం కోసం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ప్రత్యేక అదనపు బస్సులు నడుపుతున్నారు. ఈనెల 16వ తేదీ వరకు 210 ప్రత్యేక సర్వీసులను నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. అచ్చంపేట 23, వనపర్తి 27, గద్వాల 22, మహబూబ్‌నగర్ 30, కల్వకుర్తి 22, షాద్‌నగర్ 21, కొల్లాపూర్ 23, నారాయణపేట 22, నాగర్‌కర్నూల్‌కు 20 చొప్పున ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచినట్లు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి తెలిపారు.

104 శాతం ఓఆర్‌తో రీజియన్ మొదటిస్థానం

ఈనెల 1వ తేదీ నుంచి 11 వరకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ 104 శాతం ఆక్యుపెన్సి రేషియా (ఓఆర్)ను సాధించింది. రాష్ట్రంలోని 11 రీజియన్‌లలో మొదటిస్థానంలో నిలిచింది. అదే విధంగా రీజియన్‌లోని పది డిపోల్లో మూడు డిపోలు అత్యధిక ఈపీకే(ఎర్నింగ్ పర్ కిలో మీటర్), ఓఆర్‌లు సాధించడం విశేషం. ఈ 11 రోజుల్లో రీజియన్ పరిధిలో 4.48 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు.

అదనపు చార్జీలపై ప్రయాణికుల పెదవి విరుపు

దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక అదనపు బస్సులు ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు తీసుకుంటుండడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ రూట్‌లో టికెట్‌పై అదనపు చార్జీ తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులో గతంలో రూ.150 ఉంటే అదనపు బస్సుల్లో రూ.210, డీలక్స్ రూ.190లు ఉంటే రూ.250, సూపర్ లగ్జరీ రూ.200 ఉంటే రూ.300ల చార్జీ తీసుకుంటున్నారు. అయితే ఈ అదనపు చార్జీ దసరా ప్రత్యేక బస్సులు నడిపే వరకు మాత్రమే తీసుకోవచ్చని తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్‌పై 50శాతం అదనంగా తీసుకుంటుండడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.



బస్సు వద్దకు పరుగులు పెడుతున్న ప్రయాణికులు

వన్య ప్రాణుల సంరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు

మన్ననూర్: అమ్రాబాద్ అభయారణ్యంలో వన్య ప్రాణులు, అడవుల సంరక్షణ కోసం కృషి చేస్తున్న అటవీశాఖకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా భాగస్వామ్యంతో పని చేస్తామని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) ఎలుసింగ్ మేరు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం మన్ననూర్‌లోని ఈసీ సెంటర్‌లో అటవీశాఖ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ శివాణి డోగ్రా, డీఎఫ్‌ఓ రోహిత్ రెడ్డితో పాటూ సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలుసింగ్ మేరు మాట్లాడారు. అటవీ, వన్య ప్రాణుల సంరక్షణకు సహకరించే సంస్థలను భాగస్వాములను చేసుకొని అటవీశాఖ ముందుకు సాగిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా అటవీశాఖకు చేస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. యాజమాన్యం, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ప్రముఖులు అనిల్ కుమార్ ఏపూరి మాట్లాడారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా సైన్స్ ఆధారిత సంస్థ అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ సంస్థలు, వ్యక్తులు, శాఖలతో కలిసి పని చేస్తుందని అన్నారు. వన్య ప్రాణులు, ప్రత్యేకించి పెద్ద పులుల సంరక్షణకు అవసరమైన ఆవాసాలు పరిరక్షణ కోసం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా తమ వంతు బాధ్యతగా సహకారం అందిస్తుందని అన్నారు. అటవీ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేసేందుకు అవసరమైన మహీంద్ర బొలేరో క్యాంపర్ వాహనంను పీసీసీఎఫ్ సమక్షంలో అందజేశారు. అదేవిధంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వుకు సహకారం అందించడంలో భాగంగా ఫ్లాష్ లైట్లు, మెటల్ డిటెక్టర్లు, సోలార్ బేస్ క్యాంపులు, జీపీఎస్ యూనిట్లు, బూట్లు, యూనిఫామ్స్, వాకీటాకీలు, స్నిఫర్ డాగ్‌లు, కెమెరా ట్రాప్‌లు అందజేసినట్లు వివరించారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ కాలానుగుణంగా ఏర్పడుతున్న సమస్యలను అధిగమించేందుకు గానూ ముఖ్యంగా బేస్ క్యాంపు సిబ్బంది అటవీ సమీప ప్రాంతాల్లో ఉండేందుకు సౌకర్యాల కల్పన అవసరం ఉందని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ దృష్టికి తీసుకువచ్చారు. అటవీశాఖ సమక్షంలో నిర్వాహణలో ఉన్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించడతో పాటూ వారితో కలిసి క్షేత్రస్థాయి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ఫరీదా టంపల్, ఎఫ్‌డీఓ రాంమూర్తి, ఎఫ్‌ఆర్‌ఓలు దేవజ, గురుప్రసాద్, డీఆర్‌ఓ రవికుమార్, ఎఫ్‌ఎస్‌ఓలు మధు, బాబలి, శివకుమార్, ఆనంద్, ఎన్‌జీఓలు రమేష్, బీచ్యా, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సమగ్ర కులగణన జీఓ విడుదల



మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ సమాజ్, బీసీ కుల సంఘాల పోరాటల ఫలితమే తెలంగాణ సమగ్ర కులగణన జీఓ విడుదలైందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన విషయంలో నాలుగు నెలల క్రితం ఓటర్ల జాబితా ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు పెట్టడం జరిగిందన్నారు. సమగ్ర కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు వెళ్లాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటిస్తూ కులగణన చేసిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించిన విషయాన్ని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జనాల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం కులగణన జీఓను విడుదల చేసేటట్లు చేయడంలో బీసీ సమాజ్ పాత్ర చాలా కీలకమని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆలోచన విధానానికి రూపకల్పన చేసి, హామీని నిలబెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణన జీఓ విడుదల చేయడం హర్షణీయమని అన్నారు. ప్రభుత్వం కులగణన చేయడంలో బీసీలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి విషయాన్ని పరిశీలించి అందులో పొందుపరిచేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గన్న, పద్మశాలి సంఘం నాయకులు సారంగి లక్ష్మీకాంత్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు మహేందర్, ఆశన్న ముదిరాజ్, వేణుగౌడ్, మద్దూరి కృష్ణ, సుకుమార్, సవారి సత్యం, బి.శేఖర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గాలింపు చర్యలు



నల్లమల అటవీ ప్రాంతంలో వెతుకుతున్న చెంచులు

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన చెంచు వ్యక్తి నిమ్మల శంకర్ గత నెల 28న అదృశ్యమైన ఘటన విధితమే. శంకర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖ వారు డ్రోన్ సహాయంతో గాలింపులు చర్యలు చేపట్టారు. ఎర్రపెంటకు చెందిన చెంచులు ప్రతి రోజు అడవిలో వాగులు, వంకలు, గుహలు, చెట్లు తదితర లోతట్టు ప్రాంతాలలో వెతికినా ఫలితం దక్కలేదు. అదృశ్యమైన వ్యక్తి బతికే ఉన్నాడా, లేదా వన్య మృగాలకు బలయ్యాడా అనే సందేహాలు వ్యక్త మవుతున్నాయి. అదృశ్యమై వ్యక్తి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని చెంచులు కోరుతున్నారు. కలెక్టర్, ఐటీడీఏ అధికారులు స్పందించాలని చెంచులు విజ్ఞప్తి చేశారు.

ముగ్గురికి రిమాండ్

మానవపాడు: మహిళపై వేడి నూనె పోసి దాడి చేసిన సంఘటనలో సోమవారం ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ సత్యానారాయణ కథనం ప్రకారం.. మానవపాడు మండలం చిన్నపోతులపాడుకు చెందిన ప్రశాంతమ్మ అలియాస్ ఎస్తరమ్మపై ఈ నెల 10న దాడి చేసిన సంఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులు చాకలి యుగంధర్, చాకలి అరుణమ్మ, చాకలి సతీష్‌లను రిమాండ్ కోసం అలంపూర్ కోర్టు జేఎఫ్‌సీఎమ్‌కు తరలించారు. అలంపూర్ కోర్టు జడ్జి కవిత ముగ్గురిని మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించాలని ఆదేశించినట్లు తెలిపారు.